క్లుప్తంగా

చందమామ గుట్టపై కార్తీక దీపం



కార్తీక దీపానికి ప్రత్యేక పూజలు చేస్తున్న సర్పంచ్, సింగిల్ విండో మాజీ చైర్మన్

చంద్రగిరి: తమిళ కార్తీక దీపం సందర్భంగా శుక్రవారం మండల వ్యాప్తంగా శైవాలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేసి నేతిదీపాలు వెలిగించారు. అగరాల పంచాయతీలోని శ్రీఅగస్తీశ్వర ఆలయంలో ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ దేవారెడ్డి ఆధ్వర్యంలో చందమామ గుట్టపై గ్రామస్తులు కార్తీక దీపం వెలిగించి పూజలు చేశారు. ప్రతి ఏటా గ్రామం సుభిక్షంగా ఉండాలని చందమామ గుట్టపై కార్తీక దీపం వెలిగించి ప్రత్యేక పూజలు చేయడం తరతరాలుగా వస్తున్న ఆనవాయితీ అని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘యువ ఉత్సవ్’ లో ఏఐఎస్‌ఈ విద్యార్థుల ప్రతిభ



తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ వేదికగా శుక్రవారం జరిగిన యువ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక పోటీలలో ఎస్వీయూ ఏఐఎస్‌ఈ విభాగం విద్యార్థులు ప్రతిభ చాటారు. నృత్య ప్రదర్శనలో రెండవ స్థానం దక్కించుకున్నారు. వర్సిటీ ఏఐఎస్‌ఈ ప్రిన్సిపల్ డాక్టర్ జానకిరామయ్య, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

సేవా సదన్ వద్ద బుస్స్‌స్స్‌స్



పామును చూపుతున్న భాస్కర్ నాయుడు

తిరుమల: తిరుమలలోని సేవా సదన్ వద్ద శుక్రవారం నాగుపాము హల్‌చల్ చేసింది.. స్నేక్ క్యాచర్ భాస్కర్ నాయుడు తెలిపిన వివరాల మేరకు.. సేవా సదన్ వద్ద పాము ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడికి చేరుకుని చాకచక్యంగా పట్టుకున్నట్లు తెలిపారు. అది ఆరు అడుగుల నాగుపామని, దానిని అవ్వాచారి కోనలో వదిలిపెట్టినట్లు ఆయన చెప్పారు.

వైకుంఠ ద్వార దర్శనం కల్పించాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జనసేన నేతలు

తిరుపతి కల్చరల్: రానున్న వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వైకుంఠ ద్వార దర్శనాన్ని స్థానికులకు కల్పించాలని జనసేన నేత కిరణ్ రాయల్ టీటీడీకి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. స్థానికులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించాలని కోరుతూ ప్లకార్డులను ప్రదర్శించారు. జనసేన నేతలు కిశోర మనోజ్, షరీఫ్, సాయిదేవ్, ఆది, పురుషోత్తం, సుధ, శేషాద్రి, పవన్ పాల్గొన్నారు.

వేడుకగా కృత్తికా దీపోత్సవం



స్వామి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

తిరుపతి కల్చరల్: కృత్తికా నక్షత్రం పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం శ్రీకపిలేశ్వర స్వామి ఆలయంలో కృత్తికా దీపోత్సవం వేడుకగా నిర్వహించారు. భక్తుల శివ నామస్మరణ.. హరహర మహదేవ శంభో శంకర నామస్మరణ నడుమ ఈ కార్యక్రమం భక్తి పారవశ్యంతో సాగింది. సాయంత్రం 6 గంటలకు గర్భాలయం, తర్వాత స్వామి వారి ఆలయ గోపురం, శ్రీకామాక్షి అమ్మవారి ఆలయ గోపురం, ధ్వజస్తంభంపైన దీపారాధన చేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు నేతి దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఉయ్యాల మండపంలో ఏర్పాటు చేసిన శివలింగ, శూలం ఆకృతిలో ప్రమిదలు వెలిగించారు. కార్యక్రమంలో జేఈఓ గౌతమి, వీజీఓ సదాలక్ష్మి, ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



ఆలయం వద్ద టీటీడీ జేఈఓ గౌతమి తదితరులు

తిరుపతి కలెక్టరేట్ వద్ద కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్టీ జెండాలు, ప్లకార్డులతో నినదిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు





వంచన ఆయన నైజం..!

- రైతు వ్యతిరేకి చంద్రబాబు
- ‘అన్నదాత సుఖీభవ’ హామీని ఏం చేశావ్ బాబూ అని ప్రశ్నించిన రైతన్నలు
- ఆరునెలలు గడచినా పెట్టుబడి సాయం ఊసే లేదాయె
- కలెక్టరేట్ ముట్టడిలో మండిపడిన నేతలు, రైతులు



కలెక్టరేట్ ముట్టడిలో పార్టీ నాయకులు

తిరుపతి సిటీ: ‘ప్రజలను వంచించడం చంద్రబాబు నైజం.. ఎన్నికల సమయం వస్తే చాలు ఓట్లకోసం రైతులను, మహిళలను టార్గెట్ చేస్తారు.. అడ్డగోలుగా హామీలను గుప్పించి, మభ్యపెట్టి, అధికారంలోకి వచ్చాక అమలు చేయడం అసాధ్యమని చేతులెత్తేస్తారు.. గత ప్రభుత్వం అమలు చేసిన ప్రజారంజక పథకాల పేర్లు మార్చి తానేదో కొత్తగా చేస్తానన్నట్లు సూపర్‌సిక్స్ పేరుతో ఆరు పథకాలను అమలు చేసి తీరుతానని ప్రగల్భాలు పలికారు.. ఆరునెలలు కావొస్తున్నా పింఛన్ల హామీ తప్పితే తక్కిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారు.. ప్రధానంగా రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20వేలు ఇస్తానని నమ్మించి నట్టేట ముంచారు. జిల్లాలోని సుమారు 2లక్షల మంది రైతులు ఖరీఫ్, రబీ సీజన్ల ముగిసినా కూటమి ప్రభుత్వ నుంచి రైతులకు పెట్టుబడి సాయం ఒక్క రూపాయి అందలేదు.. అందుకే శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడికి వచ్చాం’ అని పలు నియోజవర్గాల రైతులు కూటమి పాలనపై ధ్వజమెత్తారు.


హామీలను తుంగలో తొక్కారు



కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చకుండా అటకెక్కించింది. ప్రతిపక్షాల పైన, దళిత, అణగారిన వర్గాలపై దాడులు చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా చంద్రబాబు నాయుడు పెట్టుబడి సాయం అందిస్తారని రైతులు ఎంతో ఆశతో ఎదురు చూశారు. చంద్రబాబు ఆ ఊసే ఎత్తకపోవడం దారుణం.

– సుబ్రమణ్యం రెడ్డి, తిరుపతి రూరల్

వ్యవసాయం అంటేనే బాబుకు గిట్టదు



చంద్రబాబు రైతు వ్యతిరేకి అని మరోసారి చాటుకున్నాడు. గతంలో ఆయన సీఎంగా ఉన్నప్పుడు వ్యవసాయం దండగ అన్నాడు. రైతులను ఓట్లకోసం మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి ఆరునెలలు కావస్తున్నా అన్నదాత సుఖీభవ పథకం హామీని నెరవేర్చకపోవడం దారుణం. పెట్టుబడి సాయం అందకపోవడంతో పంటల సాగు చేయలేకపోయాం. ఇంత దారుణమైన ప్రభుత్వాన్ని గతంలో ఎన్నడూ చూడలేదు. గత ప్రభుత్వం క్రమం తప్పకుండా ప్రతి ఏడాది రైతుభరోసా ఇచ్చి రైతులను ఆదుకుంది. ఇప్పుడు పూర్తిగా భిన్నం.

– మునిరత్నం నాయుడు, బీఎస్ కండ్రిగ, సత్యవేడు

గత ప్రభుత్వంలో వ్యవసాయం పండుగ



చంద్రబాబు ఆరునెలల పాలనలో చేసిందేమీ లేదు..అంతా ప్రచారం తప్ప. అభివృద్ధి కానరాలేదు. రైతులను చిన్నచూపు చూశారు. హామీలను నెరవేర్చిన పాపానపోలేదు. విద్యుత్ బిల్లులు పెంచేశారు. రైతుభరోసా మాటాలేదు. కొన్ని రోజులగా కురుస్తున్న వర్షాలతో నష్టపోయిన పంటలకు బీమా లేదు.. పరిహారం మాట ఎత్తడం లేదు. అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తారని ఎంతో ఆశగా ఎదురు చూసినా ప్రయోజనం లేకపోయింది. రానున్న రోజులలో బాబు సర్కార్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు.

– మధు, రైతు, చంద్రగిరి

రైతును నడిరోడ్డున పడేశారు



కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఆరునెలలు కావస్తోంది. రైతుల సంక్షేమానికి ఒక్క హామీనీ నెరవేర్చలేదు. కనీసం ఎప్పటి నుంచి అమలు చేస్తారనే ప్రస్తావన బాబు ప్రకటించకపోవడం దారుణం. వ్యవసాయరంగం ఆరు నెలలుగా జిల్లాలో కుదేలైంది. రైతుకు సబ్సిడీ విత్తనాలు అందడం లేదు. ఎరువుల కొరత, నాసిరకం ఎరువులతో నష్టం ఓ వైపు..మరో వైపు పెట్టుబడి సాయం జాడే లేదు. అప్పులు చేసి, శ్రమలకోర్చి పండిన పంటకు గిట్టుబాటు ధర లేదు. అన్నదాతను బాబు సర్కార్ నిండా దగా చేసింది.

– జనార్ధన్ యాదవ్, ఏర్పేడు, శ్రీకాళహస్తి

సూపర్ సిక్స్..అంతా తుస్స్



సూపర్ సిక్స్ పథకాలను అధికారంలోకి వస్తే అమలు చేస్తానని చంద్రబాబు ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికారు. ఆరునెలలు గడచింది చేతులెత్తేశారు. రైతులకు పెట్టుబడి అందించడంలో విఫలమయ్యారు. తుపానుతో నష్టపోయిన రైతును పలకరించేవారు లేరు. మహిళలకు ఉచితబస్సు ప్రయాణం, కుటుంబంలోని ప్రతి మహిళకు నెలకు రూ.1500, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు, అన్నదాతకు ఏడాదికి రూ.20వేలు అంటూ సూపర్‌సిక్స్ హామీలతో ఊదరగొట్టారు. ఇప్పుడంతా తుస్స్ అని చేతల్లో చెప్పకనే చెబుతున్నారు. ఆయన పాలన అంతా వంచనే.

– లోకేష్, రైతు, చింతలపాలెం, శ్రీకాళహస్తి

అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం రాజకీయమే

తిరుపతి సిటీ: రాజకీయ దురుద్దేశంతోనే ప్రముఖ సినీనటుడు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారని దళిత కాపు బీసీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివకాపు ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్ట్‌ను నిరసిస్తూ శుక్రవారం ఎస్వీయూ ఎదుట అంబేడ్కర్ విగ్రహానికి ఆయన వినతి పత్రం సమర్పించి మాట్లాడారు. గతంలో కొందరి ప్రముఖ నటుల చిత్రాల విడుదల సందర్భంగా కటౌట్‌లు కడుతూ ఎందరో అమాయకులు చనిపోతే సంబంధిత హీరోలను అరెస్ట్ చేయలేదని మండిపడ్డారు. తెలంగాణలో కక్షసాధింపు చర్యలలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి నీచానికి పాల్పడుతోందని, ప్రజలు దీనిని క్షమించరన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌పై అవగాహన

తిరుపతి సిటీ: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పద్మావతి మహిళా వర్సిటీ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు స్కిల్ ఇంటర్నేషనల్ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్‌పై శుక్రవారం వర్సిటీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్‌ఎస్‌ఎస్డీసీ ఈడీ మనోహర్ మాట్లాడుతూ, నర్సింగ్ విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాషపై ఆరు నెలల శిక్షణ ఇచ్చి, కనీసం నెలకు రూ.2.5లక్షల నుంచి రూ. 3.5లక్షల జీతంతో ఉద్యోగావకాశాలను ప్రభుత్వ కల్పిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ గంగాభవాని, రీజినల్ చీఫ్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం, ఏడీ ఎస్డీఓ మురళి, సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

అక్కగార్లకు కార్తీక మాస పూజలు

తిరుమల: తిరుమల మొదటి కనుమ రహదారిలోని అక్కగార్ల గుడిలో ఏడుగురు అక్కగార్లకు శుక్రవారం ఉదయం టీటీడీ రవాణా విభాగం కార్తీకమాస పూజ ఘనంగా నిర్వహించింది. అక్కగార్లకు సారె సమర్పించింది. అక్కదేవతలకు ప్రతి ఏటా ఈ పూజ చేయడం ఆనవాయితీ. టీటీడీ డ్రైవర్లు, స్థానికులు ఇక్కడ పూజలు చేశారు. కనుమ రోడ్డులో భక్తులు సురక్షితంగా ప్రయాణాలు సాగించేలా అనుగ్రహించాలని అక్కగార్లను ప్రార్థించారు. కార్యక్రమంలో టీటీడీ లా ఆఫీసర్ ఏ.వరప్రసాదరావు, డిప్యూటీ ఈవోలు రాజేంద్ర, ఆశాజ్యోతి, రవాణా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో పనులు చేయండి

- అధికారులకు మున్సిపల్ కమిషనర్ మౌర్య ఆదేశం



ముంపు ప్రాంతాల్లో పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: వర్షాల నేపథ్యంలో ప్రజలకు సురక్షితమైన నీరు సరఫరా చేయాలని, పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య అధికారులను ఆదేశించారు. వర్షాల వలన నీరు నిలిచిన లక్ష్మీపురం, నారాయణపురం, తదితర ప్రాంతాలను ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి శుక్రవారం ఉదయం ఆమె పరిశీలించి మాట్లాడారు. మున్సిపాలిటీ సరఫరా చేసే నీరు, వర్షపు నీరు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షపు నీరు రోడ్లపైకి రాకుండా మురుగు కాలువల్లో చెత్త ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం మెరుగు పరచి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనులు చేయాలన్నారు. మెయిన్ రోడ్డు పక్కనే చేపల మార్కెట్ ఉండడం వలన దుర్గంధం చిమ్ముతోందని ఫిర్యాదులు రావడంతో చేపల మార్కెట్‌ను పరిశీలించారు. మార్కెట్‌కు వెనుక వైపు ఉన్న ప్రాంతంలోనికి మార్కెట్‌ను తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసీపీ బాలాజి, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి వద్ద చెత్త సేకరణ

తిరుపతి సిటీ: నగరంలో ప్రతి ఇల్లు, వ్యాపార సముదాయాల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, వాహనాల జీపీఎస్ ట్యాగింగ్, వాహనాల రూట్ మ్యాప్ తదితర అంశాలపై హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం సమావేశమై సమీక్షించారు. నగరంలో చెత్త సేకరణకు వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేసి ఏ మార్గాల్లో ఎన్ని గంటలకు వెళుతున్నాయి? వాహనంతో పాటు ఎంతమంది వెళుతున్నారనే సమాచారం నమోదు చేయాలని ఆదేశించారు. వంద శాతం ముఖ ఆధారిత హాజరు నమోదు ఉండాలన్నారు. అన్నారు. వార్డులకు ప్రత్యేకంగా నియమించిన అధికారులు మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు కృషి చేయాలన్నారు. సమీక్షలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, డీఈలు మహేష్, రమణ, హెల్త్ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, అధికారులు పాల్గొన్నారు.



• కార్తీక జ్యోతి దర్శనం

కార్తీకదీపం సందర్భంగా శుక్రవారం సాయంత్రం తిరుపతి కపిలతీర్థంపై గాండ్ల కులస్తులు దీపం వెలిగించారు. తరతరాలుగా గాండ్ల కులస్తులు ఇక్కడ దీపం వెలిగించడం ఆనవాయితీ. అలాగే అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సైతం దీపాలు వెలిగించారు. జలపాతం హోరున జాలువారుతూ భక్తులకు కనువిందు చేస్తోంది. జలపాతం వేగం పెరగడంతో పుష్కరిణిలోకి భక్తులు వెళ్లకుండా ఇనుప కంచెలు ఏర్పాటు చేశారు.ఈ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



దీపం వెలిగిస్తున్న గాండ్ల కులస్తులు

సుమధురం.. గానామృతం

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో శుక్రవారం సాయంత్రం ప్రముఖ గాయనీ గాయకులు ఆలపించిన అమర గాయకుడు ఘంటసాల పాటల గానామృతం శ్రోతులను ఓలలాడించింది. ఘంటసాల 102 జయంతి పురస్కరించుకుని తిరుపతి ఫిలిం సొసైటీ «మనసు పరిమళించెనే» పేరుతో తలపెట్టిన మూడు రోజుల సంగీత విభావరి శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా ఎస్‌బీబీ అధినేత వెంకటేశ్వర చౌదరి, గేట్ విద్యా సంస్థల అధినేత తమ్మినేని వెంకటేశ్వర్లు, పారిశ్రామికవేత్తలు డాక్టర్ పీసీ.రాయులు, సనత్‌కుమార్, మ్యూజిక్ కళాశాల అధ్యాపకుడు సుధాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మానసికోల్లాసానికి సంగీతం ఎంతో అవసరమని, సుమధుర స్వరంతో ఘంటసాల తన పాటలతో ప్రపంచ స్థాయిలో తెలుగు ఖ్యాతిని ఇనుమడింపజేసి చిరస్మరణీయులుగా నిలిచారని కీర్తించారు. అంతటి అద్భుతమైన గాయకుని సుమధుర పాటలను సంగీత విభావరితో నేటి తరానికి అందిస్తున్న తిరుపతి ఫిలిం సొసైటీ ప్రతినిధులు అభినందనీయులన్నారు. అనంతరం సాయి ప్రజ్వల, సాయి శశాంక ప్రవస్తి, రాజు ఘంటసాల పాటల గానంతో ప్రేక్షకులను మైమరిపించారు. ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, అధ్యక్షుడు వైఎస్.బాబు, కార్యదర్శి సీఆర్‌కే.శేషగిరిరావు, ఉపాధ్యక్షుడు బుజ్జిబాబు నాయుడు, బండి మధుసూదన్‌రెడ్డి, గుల్జార్, అనసూయ, శాంతవాణి, శమంతకమణి, మాజీ అధ్యక్షుడు గురివిరెడ్డి, రాజ్యలక్ష్మి భాస్కర్, నారాయణ పాల్గొన్నారు.





పాటలను ఆలపిస్తున్న గాయనీ గాయకులు, అతిథులను సత్కరిస్తున్న తిరుపతి ఫిలిం సొసైటీ ప్రతినిధులు

రైతుల మద్దతుతో విజయమే లక్ష్యం

- నీటి సంఘాల ఎన్నికలపై ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి

చంద్రగిరి: నీటి సంఘాల ఎన్నికల్లో రైతుల మద్దతు కూడగట్టుకుని విజయ పతాకం ఎగురవేయాలని ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల వ్యాప్తంగా శనివారం నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో శుక్రవారం ఆయన జెడ్పీటీసీ యుగంధర్ రెడ్డితో కలసి పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. చంద్రగిరి మండలంలో పది చెరువులకు నీటి సంఘం ఎన్నికలు నిర్వహించనున్నారని, 68 డైరెక్టర్ పోస్టులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పోటీలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని కణితిమడుగు చెరువు, పోట్లకోన చెరువు, పాలేటి కోన చెరువు, మాలవాని చెరువు మూలపల్లి చెరువు, జర్లకోన చెరువు, చెరువు, కదంకాలువ చెరువు, వెంకట్రాయిని చెరువు, కొండ్రెడ్డికండ్రిగ చెరువుల ఎన్నికలకు పార్టీ తరపున అభ్యర్థులు పోటీలో ఉంటారన్నారు. శనివారం ఉదయమే పోలింగ్ స్టేషన్‌కు నాయకులందరూ అభ్యర్థులను తీసుకెళ్లి, అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గకుండా సకాలంలో నామినేషన్లు వేసేలా చూడాలన్నారు. అన్నింటా వైఎస్సార్‌సీపీ గెలిచేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వెంకటరత్నం, డివిజన్ పార్టీ అధ్యక్షులు అగరాల దేవారెడ్డి, కుప్పరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు బోస్ చంద్రారెడ్డి, సర్పంచ్ ప్రకాష్ రెడ్డి, పార్టీ నాయకులు యారాశి చంద్రశేఖర్ రెడ్డి, పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, నగిరి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నోటరీల వివరాలు సేకరించిన పోలీసులు

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు సముదాయాల వద్ద, వేషాలమ్మ గుడి వద్ద ఉన్న నోటరీలు(న్యాయవాదులు) వివరాలను స్థానిక వెస్ట్ పోలీసులు శుక్రవారం సేకరించారు. వివరాల్లోకి వెళితే...ప్రజలకు ఆదాయం, కులం, జనన మరణ ధ్రువపత్రాలతోపాటు ఇతర పత్రాలను ప్రభుత్వం నుంచి పొందాలన్నా న్యాయవాది నోటరీ చేసిన అఫిడవిట్ ఇవ్వాల్సి ఉంది. అలాగే బ్యాంకులు, బీమా సంస్థలు, వివిధ రకాల సంస్థలు నోటరీ అఫిడవిట్లను తీసుకుని ప్రజలకు సేవలందిస్తాయి. అయితే స్థానిక కోర్టు, వేషాలమ్మ గుడి వీధి వద్ద న్యాయవాది నోటరీలు కాకుండా కొంతమంది వారే నోటరీలుగా చలామణి అవుతూ వారే అఫిడవిట్లలో సంతకాలు చేస్తున్నారని వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో వివరాల సేకరణకు రావడం కలకలం రేపింది. ఆయా ప్రాంతాల్లో న్యాయవాది నోటరీలు ఎంతమంది ఉన్నారు? వారి వివరాలు, వారు అఫిడవిట్లపై వేసే సీలును న్యాయవాదుల నుంచి సేకరించారు. న్యాయవాది నోటరీ కానీ వారు అఫిడవిట్లపై న్యాయవాదుల నకిలీ సంతకాలు చేస్తున్నట్టు ఫిర్యాదు అందడంతో ఈ వివరాలు సేకరిస్తున్నట్టు పోలీస్ అధికారులు మీడియాకు తెలిపారు. వివిధ మీ–సేవ సంస్థలు, సచివాలయాలకు, ఇతర సంస్థలకు కొంతమంది న్యాయవాది నోటరీల సంతకాలను ఖాళీ స్టాంప్ పేపర్లపై పెట్టి ఇచ్చినట్టు పోలీసుల దర్యాప్తులో తేలినట్టు తెలిసింది.

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో సరికొత్త సంస్కృతికి తెరలేపారు. తాత్కాలిక ఉద్యోగులను టార్గెట్ చేస్తూ యూనియన్ల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని పలువురు ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఇప్పటివరకు దీనిపై దృష్టి సారించకపోవడం గమనార్హం.



ఎస్వీయూ పరిపాలనా భవనం

ఎస్వీయూలో

అక్రమ వసూళ్లు!

- యూనియన్ల దందా
- గగ్గోలు పెడుతున్న తాత్కాలిక ఉద్యోగులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో దాదాపు 3వేల మందికి పైగా తాత్కాలిక ఉద్యోగులు పనిచేస్తున్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. రెండు నెలలుగా వేతనాలు నిలిచిపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు తమ వద్ద ఉన్న బంగారం తాకట్టు పెట్టి, మరికొందరు అప్పులు చేసి కుటుంబ అవసరాలను తీరుస్తున్నారు. మరోవైపు ఈఎంఐలు చెల్లించలేక అపరాధ రుసుం భరించి చెల్లించిన సందర్భాలు అనేకం. ఈ నేపథ్యంలో రెండు నెలల జీతాలు ఎట్టకేలకు ఈనెల మొదటివారంలో ఉద్యోగులకు జమకావడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. చేసిన అప్పులు తీర్చుకునే పనుల్లో పడ్డారు. ఇంతలోనే వర్సిటీలో పనిచేస్తున్న కొందరు తాత్కాలిక ఉద్యోగుల యూనియన్ల అభివృద్ధి కోసం, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం విజయవాడలోని ఉన్నతాధికారులను, ప్రభుత్వ నేతలను కలిసేందుకు రవాణా ఖర్చుల పేరుతో వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం.

రూ.500 నుంచి 5వేల వరకు వసూలు..!

ఒక్కో ఉద్యోగి నుంచి రూ.500 నుంచి రూ.5వేల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారని వర్సిటీలో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులు లబోదిబోమంటున్నారు. చాలీ చాలని జీతంతో జీవనం సాగిస్తున్న తమ నుంచి యూనియన్ల పేరుతో నగదు ఫోన్ పే చేయాలంటూ ఒత్తిడి చేస్తూ ప్రత్యేకంగా ఫోన్‌పే స్క్రీన్‌ను తమకు పంపుతున్నారని ఉద్యోగులు యూనియన్ల దోపిడీపై ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే లక్షల్లో సొమ్ము వసూలైందని, చిరుద్యోగులైన తమను వేధించడం దారుణమని అధికారులు దీనిపై దృష్టి సారించి వసూళ్ల పర్వానికి చెక్ పెట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు.